ఊరూ వాడా ఏకం చేస్తున్నట్టుగా వారం రోజుల నుంచి ఒకటే వర్షం. జనం ఎండకి ముఖం వాచిపోయారు. వాగులూ వంకలూ పొంగి పొర్లుతున్నాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయి పోయాయి. జనజీవనం స్తంభించింది. బీదాబిక్కీ అతలాకుతలం అయిపోతున్నారు.

ఇదేం వాన! ఈ మధ్య కాలంలో ఎప్పుడూ చూడలేదు అనుకున్నారు అంతా. అయితే అతి వృష్టి... లేకపోతే అనావృష్టి. రెండేళ్ళుగా సరయిన వర్షం లేదు. నీటి ఎద్దడి. ఇళ్ళల్లో బోరింగులు కుయ్యో మొర్రోమంటూ నీళ్ళు తోడిపోస్తున్నాయి.

ఒక మోస్తరు జనాభా ఉన్న పట్నం అది. అక్కడ నిధులు చాలని దరిద్రగొట్టు మునిసిపాలిటీ ఉంది. రెండ్రోజులకోసారి నీరు విడుస్తున్నారు. కొళాయిల దగ్గర తగువులు రోజుకో మాదిరి రసకందాయంలో పడుతుంటాయి.

మునిసిపల్ సరిహద్దుకు దగ్గరగా, నేషనల్ హైవేకి అడ్డంగా ఉత్తర వాహినిగా ప్రవహిస్తోంది 'వేగావతి'. పేరు గొప్ప; ఊరు దిబ్బ అన్నట్టు వేగావతికి వేగం లేదు. ఆగిపోయిన కన్నీటిచాలులా వేగావతి నదిలో నీటి జాలు. అంతా ఇసకదిబ్బలు. ఉండీ లేనట్టుగా నీరు పారుతూ ఉంటుంది. అలాంటి వేగావతి నది మీద ఎప్పుడో కట్టిన బ్రిడ్జి.

అలాంటి వేగావతికి ఇప్పుడు వరదొచ్చింది. వేగావతి పొంగి పొర్లింది. గంగమ్మతల్లికి గంగ వెర్రులెత్తినట్టు ఒకటే వాన! వేగావతికి వరద రాక ఏం చేస్తుంది? నంగనాచి తుంగబుర్రలాగా పారే వేగావతి — కట్టలు తెంచుకుని మహోధృతంగా ప్రవహిస్తోంది. జనం గుంపులు గుంపులుగా అంత వర్షంలోనూ గొడుగులు వేసుకుని, సగం సగం తడుస్తూ కూడా యేరు ఉరవడి చూసి వెళ్తున్నారు.

వేగావతి ప్రవాహంలో ఎక్కడెక్కడి మానులూ మాకులూ కొట్టుకొస్తున్నాయి. ఒడుపుగా ఒడ్డుకు చేర్చుకోవాలనే ఉబలాటమే తప్ప — తెగించి వరద నీటిలోకి దిగే గుండె దిటవు లేదెవరికీ. దుంగలూ, మానులూ, కలపా కంపాతో పాటు, ఆ యేటికి బలయిపోయిన అమాయక జీవులు కూడా అప్పుడప్పుడు నీటి వాలులో కొట్టుకొస్తున్నాయి. జనం హాహాకారాలు చేస్తున్నారు. పిల్లల కేరింతలకు అడ్డు లేకుండా పోయింది. అంత నీటి ప్రవాహాన్ని పుట్టాక వాళ్ళెప్పుడూ చూడలేదు.

వేగావతి వరదనీరు బురద బురదగా, ఎర్రఎర్రగా కోపిష్టికి చెప్పుడు మాటలు తలకెక్కినట్టు మహావేగంగా ప్రవహిస్తోంది. అంత వరద ఎప్పుడూ విన్నదీ కాదు. కన్నదీకాదు. కాబట్టి అక్కడి జనానికి అదో వింత.

వాళ్ళ సరదా, ఉత్సాహం అట్టేసేపు నిలవలేదు. చూస్తుండగానే వేగావతి మీది బ్రిడ్జి కాస్తా కూలిపోయింది. జనం గొల్లుమన్నారు. గుండెలవిసి పోయేలా అరవసాగేరు. ఆప్త బంధువులెవరో అకాల మరణం పొందినట్టుగా అయ్యో అయ్యో అంటూ అరవసాగేరు. మరో క్షణంలో వంతెన కూలిపోయిన వార్త ఊర్లో పాక్కిపోయింది. జనం విరగబడిపోయేరు. ఏటి వరద నోటి దురద మంచిది కాదు. బంగారం లాంటి వంతెన కుప్పకూలి పోయింది. ఆ పాత రోజుల్లో మహా అయితే రెండో మూడో లక్షలు పోసి కట్టి ఉంటారు. ఇప్పుడెలా?

వంతెన కూలిపోవడంతో ఆ ఊరికి బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోయింది. ఆ వంతెన మీది నుంచి రోజూ వందలాది లారీలు, బస్సులూ తిరుగుతూ ఉంటాయి. ఇప్పుడవన్నీ బంద్. ఏరు తీసేక కనీసం కాజ్‌వే అన్నా నిర్మించాలి. అంతవరకు రాకపోకలు బంద్. ఒరిస్సా సరిహద్దులో ఉన్న ఆ ఊరికి ఆ వంతెన అవసరం అంతా ఇంతా కాదు. చుట్టు తిరిగి మక్కువ మీద నుంచి వెళ్ళాలంటే అదనంగా మరో నాలుగ్గంటల ప్రయాణం. ఆ రోడ్డు కూడా మంచిది కాదు. చిన్న చినుకులకే గతుకుల్లో బళ్ళు దిగబడుతూ ఉంటాయి. కనుక ఆ దారి మీద ఆశ లేదు. ఏరు తీసాక కాజ్‌వే నిర్మించాలి. అధికార యంత్రాంగం ఎప్పటికి కదిలొస్తుందో తెలీదు. 'ఎంచబోతే మంచమంతా కంతలే' — అన్నట్టు ఎవరినీ అని లాభం లేదు. హైవే మీద అతి ప్రధానమయిన ఆ వంతెన కూలిపోయే పరిస్థితి వచ్చే వరకు ఎవరూ పట్టించుకోలేదు. కుంచాలమ్మ కూడబెడితే మంచాలమ్మ మాయం చేసిందన్నట్టు — మంత్రులొస్తున్నారంటే సున్నం బొట్లు పెట్టడం తప్ప ఆ వంతెనను ఎవరూ పట్టించుకోలేదు. వేగావతి విరగదీసింది. తన తడాఖా చూపించింది.

రైలు మార్గం లేని ఆ ఊరికి బ్రిడ్జి కూలిపోవడంతో రెక్కలు విరిగి పోయినట్టయింది. సరుకుల రవాణాకి గండి కొట్టింది.

జరూరు పనుల మీద పై ఊళ్ళకు వెళ్లాలంటే పిల్లాజెల్లాతో, ముసలీ ముతకాతో ఏట్లోంచి నడిచి అవతలి ఒడ్డుకు వెళ్ళాలి.

అయినా, ఇదంతా వరద నీరు తగ్గేక కదా!

ఊరి ప్రజల కష్టాలు అప్పుడే కదా మొదలయ్యేది.

వాతావరణం రెండ్రోజుల తర్వాత తెరిపి ఇచ్చింది. వర్షం తగ్గింది. ఊరి జనం ఊపిరి పీల్చుకున్నారు.


కూలీ నాలీ చేసుకుని బ్రతికే వాళ్ళ ఇళ్ళలో వారం రోజులుగా పొయ్యిలో పిల్లి లేవడం లేదు. రిక్షా వాళ్ళకి బేరాల్లేవు. వేగావతి వరద



తగ్గింది. కొంచెం ధైర్యం చేస్తే ఒళ్ళూ, బట్టలూ తడిస్తే తడుస్తాయి కానీ అటువేపు చేరడం అసాధ్యం ఏమీకాదు. ఆర్టీసీ వాళ్ళు వేగావతికి అటువేపు నుంచి నడపడం ప్రారంభించారు. వంతెన దగ్గర నిర్మానుష్యంగా ఉండే ప్రదేశమంతా ఇపుఒప్డడు కలకలలాడుతోంది. చుట్ట బీడీ సిగరెట్ల వంటి చిల్లర బేరాలవాళ్ళు అక్కడ జోరుగా వ్యాపారాలు చెయ్యడం ప్రారంభించారు. కూలీనాలీ జనానికి చేతినిండా పని దొరికింది. వంతెన కూలిపోవడంతో వాళ్ళకు అనుకోని గిరాకీ తగిలింది. వాళ్ల బ్రతుకులకు పండుగొచ్చినంత సందడిగా ఉంది. ఎడతెగని వర్షాన్ని చూసి కూలి పనులు పోయినందుకు విసుక్కున్న వాళ్ళే ఇవాళ సంతోషిస్తున్నారు. వరదొచ్చి కరవు తీరిపోయినట్టయింది వాళ్లకు.




వంతెన పడిపోవడంతో వాళ్ళకు చేతినిండా పని దొరికింది. ఏటికి అటువేపు బస్సుల కోసం జనం తండోపతండాలుగా వస్తున్నారు. వరద తగ్గినా వేగావతి లోతు తగ్గలేదు. సామాన్లు మోసుకుంటూ ఆ నీట్లో నడవడం జనానికి వల్లకావడం లేదు. కూలివాళ్లకి గిరాకీ పెరిగింది. చిన్నా చితకా లగేజీకి కూడా రూపాయికి తక్కువ తీసుకోవడంలేదు.




సరుకుల లారీ వస్తే కూలి మనుషుల పంట పండిందే. మామూలు కన్నా రెట్టింపు వసూలు చెయ్యడం మొదలుపెట్టారు. నీట్లో తడవకుండా స్కూటర్లు, మోపెడ్లు అవతలకి కర్రలు కట్టి చేరవేయడానికి పాతిక రూపాయలకి తక్కువ తీసుకోవడంలేదు. ఏటొడ్డున అద్దరీ ఇద్దరీ కూడా తొడతొక్కిడిగా ఉంది. కూలి జనం ముఠాలు కట్టేరు. ఒక్కో మేస్త్రీకి పదిమందికి తక్కువ లేకుండా కూలీలున్నారు. బేరం జారిపోవడానికి ఎవరూ ఇష్టపడడంలేదు. పెట్టెకింత, సూట్‌కేసుకింత, బస్తాకింత అని రేట్లు పెట్టారు. వరదనీరు మరి కాస్త తగ్గిపోయి, వేగావతికి ఎప్పటిలాగా ప్రవాహం తగ్గిపోతే తమకు బేరాలు మరి ఉండవని వాళ్లకు తెలుసు. వాళ్ల అదృష్టం బాగుండి ఇప్పుడు రోజుల కొద్దీ ముసురు పెట్టకపోయినా, ఉండీ ఉడిగీ చిన్న చిన్న వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఇక్కడ వానలేకపోయినా, ఒరిస్సా కొండల్లో పడితే చాలు వేగావతికి ఈ యేడు నీరు బాగా ఒచ్చేస్తోంది. ఏటవతల కొత్త వాళ్లెవరయినా బస్సులు దిగి ఊళ్లోకి రావాలనుకుంటే వీళ్లపంట మరింత పండినట్టే. ఆ బేరాల కోసం ఎగబడుతున్నారు. కొద్ది రోజుల తంతేనని అందరికీ తెలిసిందేకనక ఒక కట్టడిలేదు. దంచినమ్మకి బుక్కిందే దక్కుడు. చేతుల్లో లగేజ చేతుల్లో ఉండగా లాగేసుకుంటున్నారు. వంతెన కూలిపోబట్టి, వేగావతికి ఎప్పుడూ లేనంతనీరు రాబట్టి ఊహించని విధంగా తమకు చేతినిండా నాల్రోజులు పని దొరికిందని వాళ్లకు తెలుసు. అందుకే వాళ్ల ఆత్రం. వచ్చిన బేరం చెయ్యి జారిపోకూడదన్న తొందరలో వాళ్ల మధ్య చిన్న చిన్న ఘర్షణలు కూడా తలెత్తుతున్నాయి. 'ఊరు ఉసిరికాయంత తగువు తాటికాయంత' అనీ, రెండ్రోజుల్లో పోయే గిరాకీల కోసం ఎప్పుడూ లేనిది వాళ్లలో ఉద్రిక్తతలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఆ తగువే వారిమధ్య నలుగుతోంది. తగువుకి కారణం పరమేశు—

★ ★ ★

"ఏటిరోయ్ పరమేశం. మల్లయిలగొచ్చినావేటి?" కొంచెం వెటకారంగానూ, మరి కొంచెం కోపంగానూ అడిగేడు మేస్త్రీ సాంబయ్య.

"నా నొస్తే నీకేటి మద్దెన?" విసురుగా జవాబిచ్చాడు పరమేశు.

"రావొద్దని సెప్పనేదూ?"

"నువ్వేల రావొద్దంటావూ? నానేటి బరువులు మొయ్యలేనా? కూలిపని సెయ్యలేనా?"

"స! స! సేసేవులే... గొప్ప దయిర్నం—నీటిని సూస్తే కళ్లు తిరిగి సతికిలపడిపోతావు... సేసింది సాల్లే... పల్లకెలిపో... వడ్డాదోరి మిల్లుకాడ బస్తాలు మోసుకో—ఫో!"

సాంబయ్య యీసడింపు పరమేశుకి రోషం తెప్పించింది. వాడి ముక్కుపుటాలు కోపంతో అదిరేయి. కోపంతో పూనకం వొచ్చిన వాడిలా ఊగిపోయేడు. తగువుకి దిగేడు. నోటికొచ్చిన బూతులు తిట్టేడు. తనని వాళ్లు అలా బహిష్కరించడం వాడు సహించలేక పోయేడు. చిందులు తొక్కేడు.

వేగావతి దయవల్ల కూలోల్లకి నాలుగు డబ్బులు గలగలలాడుతున్నాయి. సాయంత్రం పొద్దుపోయేదాక నీట్లో నానుతూ అటుయిటూ సామాన్లు మోసి సంపాదించిన దాంట్లో తాగి మజా చేస్తున్నారు. మిగిలిందే యింటికిస్తున్నారు. అయినా అదికూడా మునపటికన్నా ఎక్కువ మొత్తమే కావడంవల్ల ఆడాళ్లు సంతోషిస్తున్నారు. అలాంటి రాబడి చూస్తూ చూస్తూ ఎలా ఒదులుకోగలడు?

"నా భార్యకు సంగీతం బాగా వచ్చు. కానీ పాటలు పాడదు.." బాధగా అన్నాడు మోహన్.

"ఎంత అదృష్టవంతుడివోయ్. నా భార్యకు సంగీత జ్ఞానమే లేదు కానీ పాటలు మాత్రం పాడుతుంది..." వాపోయాడు గోపి.

—సి.ఎస్. రావు



ముందు రోజు సాయంత్రం వాడిని తన్నినంత పని చేసి, మరింక ఏటివైపు రావద్దని తగిలేశారు సాంబయ్య, అతని మనుషులు. పరమేశు సాంబయ్య ముఠాలోని మనిషే. మొదటి రెండు రోజులూ కూలీ పంపకాలలో బాగానే వచ్చింది. తీరా నిన్న సాయంత్రమే వాడి వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది. ధాన్యం బస్తాల లోడు అవతలి గట్టుకి వచ్చి ఆగింది. బస్తాలన్నీ ఇవతలి గట్టునున్న బళ్ళ మీదకి చేర్చడానికి సాంబయ్య లారీ వాళ్ళతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. మంచి గిట్టుబాటు వ్యాపారమే. కూలీలంతా హుషారుగా పనిలోకి దిగారు. చకచకా బస్తాలు మొయ్యడం ప్రారంభించేరు.

అప్పటికి కొద్ది కొద్దిగా చీకటిపడుతోంది. మున్సిపాలిటీ వాళ్ళు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లైట్లు ఒకటీ, అరా — చీకటితో పోరాడుతున్నాయి. జనం పలచగా ఉన్నారు. ఈ రోజుకి బహుశా ఇదే బేరం. మేస్త్రీ డబ్బులు వాటాలు వేసి ఇస్తే ఇళ్ళకి పోవడమే తరవాయి. అందరితో పాటు పరమేశు కూడా మహా ఉల్లాసంగా బస్తాలు మోస్తున్నాడు. ఆవేళ దొరకబోయే మొత్తం ఎక్కువేనని వాడికి తెలుసు. వాడికి సంతోషం పట్టనలవి కాకుండా ఉంది. ఉదయం నుంచీ పడిన శ్రమని మరిచిపోయినట్లుగా పని చేస్తున్నాడు. ఇంట్లో కొడుక్కి జ్వరంగా ఉంది. వాడికి మంచి మందు ఇప్పించాలి. భార్య గైరమ్మకి గాజులూ, పచ్చగళ్ళ నేత చీర కొనాలి. పాపం దానికి కట్టుకో చీర. తడుపుకో చీర... చాలా రోజులై దాని అవస్థ చూడలేకపోతున్నాడు. కూలిపోయిన వంతెన తన కొంప నిలబెడుతోంది. గంగమ్మ తల్లీ! ఇంకా ఇంకా ఎక్కువగా పారమ్మా... లోతు తగ్గిపోతే మా చేతులకి పనుండదు. మళ్ళీ మామూలే. చాలీచాలని కూలి డబ్బులతో — దొరికిన నాడు మస్తు; లేనినాడు పస్తు. ఈ తల్లి ఇలాగే కనికరిస్తే మరో వారం పది దినాలు ఢోకా లేదు. వాడు ఆలోచనల్లో తేలిపోతూ అడుగులేస్తున్నాడు.

ఊహలు ఊళ్ళేలుతుంటే కర్మం కట్టెలు మోస్తోందని ఏవేవో ఊహల్లో తేలిపోతూ మొల ఒంటె కట్టెలు మొల ఒంటి నీటిలో నడుస్తున్న పరమేశు కాళ్ళకి ఏదో రాయి తగిలి బొక్క బోర్లాపడ్డాడు. నెత్తి మీద ధాన్యం బస్తా నీళ్ళలో పడిపోయింది. లబోదిబోమన్నారంతా. చీకట్లో బస్తా మరి కనిపించలేదు.

కనిపించినా ప్రయోజనం లేదు. గంగ తల్లి బస్తాడు ధాన్యం మింగేసి ఉంటుంది.

అంతా పరమేశుని తిట్టిపోశారు. కొట్టినంతపని చేశారు. లారీ వాళ్ళు కయ్యానికి దిగారు. సాంబయ్య వాళ్ళకి బస్తా ధాన్యానికి డబ్బులు కట్టుకోక తప్పింది కాదు.

ఈ సంఘటన జరిగేక ఆవేళ ఇవ్వాల్సిన డబ్బులు అన్నీ నష్ట పరిహారం కింద విరగ్గొట్టుకుని మరింక యేటి ఒడ్డుకి వస్తే మర్యాద దక్కదని హెచ్చరించి వాడిని పంపించేశారు. ముందు రోజు రాత్రి పరమేశుకి కంటి మీద కునుకురాలేదు. మనసు మనసులో లేదు. చెయ్యిజారిపోతున్న అదృష్టాన్ని తలుచుకుని కుమిలి కుమిలి ఏడ్చాడు. కొడుక్కి జ్వర తీవ్రత ఎక్కువయింది. గైరమ్మ దుఃఖం చూడలేకపోయాడు. ఏం చెయ్యడానికీ తోచక విలవిలలాడిపోయాడు. రాత్రంతా తలపేలిపోయే ఆలోచనలతో ఎలాగో గడిపేశాడు. తెల్లారేక కొడుక్కి కొంచెం నిమ్మళించింది. ఆ దిగులు తీరింది. కానీ వాడి మనసంతా యేటి ఒడ్డున కూలి పని మీదే ఉంది. వెళ్ళకుండా ఉండడానికి మనసు నిలవడంలేదు. వెళ్తే సాంబయ్య వాళ్ళ చేత ఏం తిట్లు తినాలో అన్న భయం వాడిని పీడిస్తోంది.

పగలంతా ఊగిసలాటతో కాలు గాలిన పిల్లిలా ఇంట్లో తిరిగాడు. ఏటి దగ్గర కూలి పని కోసం వెళ్ళాలని వాడి మనసు తహతహలాడిపోతోంది. గైరమ్మ వాడి బాధ చూసి దిగులుపడింది. "ఇయేల్టికి రేపు రెండో రోజు... యేరలాగే ఉండిపోతదేటి? ఆ బేరాలు శాశితఁవేటి? మద్దెలో వచ్చింది మద్దిలో పోతాదని— అటేపింక ఎల్లక... నా మాటినుకొని ఒడ్డోదారి మిల్లుకాడికెళ్ళి కూలి సేసుకో" అని నచ్చచెప్పింది.

దాని మాటలు వాడి చెవికెక్కలేదు. మరింక మనసు ఉగ్గబట్టుకోలేక పోయేడు. సాయంత్రం వరకూ ఎలా నిగ్రహించుకున్నాడో అంతే. మరింక ఆగలేక యేటిదగ్గర కొచ్చేడు.

వాడి రాకతో తగువు మొదలయింది. అందరూ యీసడించుకోవడం మొదలుపెట్టారు. వాడివల్ల వచ్చే బేరాల
చ్చవెడిపోతాయనిచీదరించుకున్నారు.

రాను రాను తగువు పెద్దదయింది.

కేకలు మిన్ను ముట్టాయి. చేయీ చేయీ కలిసి ఒకర్నొకరు తోసుకుంటూ అరుచుకోడం మొదలుపెట్టేరు. సాంబయ్య మనుషులు పరమేశుని ఓ తప్పు చేసాడని యిలా దుర్భాషలాడి తగిలెయ్యడం మిగతా ముఠాల్లోని కూలీలకు నచ్చలేదు. వాళ్లలో కొందరు పరమేశం పక్షాన నిలిచేరు. కూలీలంతా ప్రత్యర్థుల్లా విడిపోయేరు. నువ్వెంతంటే నువ్వెంత అనుకున్నారు.

ఏటి ఒడ్డున యిసకలో కుమ్ములాట మొదలయింది. సన్నగా పడుతున్న వర్షపు జల్లులను ఎవరూ పట్టించుకోడం లేదు. ఏటి మీద పల్చని చీకటి పరదాలు పరుచుకుంటున్నాయి. ఆ కూలీల తగువు అర్థం కాక మిగతా జనం చూస్తూ ఉండిపోయేరు.

తిట్లు పచ్చి బూతులై మిన్ను ముట్టేయి. ఆ చిచ్చు అలా రగిలి రగిలి పొగలై సెగలై వేగావతి వరదలా హోరెత్తిపోయింది. సంత పశువుల కుమ్ములాటలా ఏం జరుగుతోందో తెలీడంలేదు. కడుపు కక్కుర్తి కరాళనృత్యం చేస్తోంది.

వర్షం పెద్దదయింది. వాళ్ల రగడ చల్లారలేదు. చూస్తుండగానే ఒకర్నొకరు కసిగా తన్నుకోడం మొదలెట్టారు. ఒకప్రక్క ఏటిహోరు. మరోప్రక్క వీళ్లకేకలు. అంతా రణరంగంలా తయారయింది. రక్తాలు కారేలా కొట్టుకుంటున్నారు.

ఇంతలో అనుకోనివిధంగా సాంబయ్య మనుషులు, పరమేశుని తిడుతూ నెట్టుకుంటూ 'వెళ్లి నీట్లో పడ్డారు. మధ్యాహ్నం ఒరిస్సా కొండల్లో కురిసిన వాన వల్ల వేగావతికి వఔదనీరొచ్చిన విషయం ఆ సంజచీకట్లలో వాళ్లు గమనించలేదు. నిశ్శబ్దంగా కమ్ముకొచ్చే మృత్యువులా ఏటినీరు రానురాను ఉధృతమవుతోంది. పట్టలేని కోపంతో సాంబయ్య మనుషులు పరమేశుని నీట్లో గుంజిగుంజి వదిలిపెట్టారు. చావు భయంతో వాడికేకలు ఏటిహోరుతో కలిసి ప్రతిధ్వనించేయి. అప్పుడు గమనించేరు వాళ్లు — వేగావతికి వరద వచ్చిన సంగతి. ఒకర్నొకరు హెచ్చరించుకుంటూ గబగబ ఒడ్డుకి చేరారు.

కసితీరిన గర్వంతో రొప్పుతున్న సాంబయ్య మనుషులకి —

తమ మధ్య సాంబయ్య కనిపించడం లేదన్న విషయం స్ఫురించి అదిరిపోయేరు. "సాంబయ్యా! సాంబయ్యా!' అంటూ గుండెలు అదిరిపోయేలా అరవడం మొదలుపెట్టారు. అసలే రక్తపోటు మనిషి. ఈ గొడవకి మరింత బి.పి. పెరిగిపోయింది వాడికి. నీటిలో ఏమయిపోయేడో తెలీడంలేదు.

కూలీల హాహాకారాలతో ఆ ప్రదేశం దద్దరిల్లిపోయింది. చీకటి జవాబు చెప్పడం లేదు. కాని —

అక్కడికి చాలాదూరంలో — అతికష్టంమీద అవతలిఒడ్డుకి చేరిన పరమేశు భుజంమీద మనిషిని ఇసకమీదకి చేర్చి ఆయాసంతో రొప్పుతున్నాడు.